సత్యవేడు బుడతలు..

కరాటే చిరుతలు

- మార్షల్ ఆర్ట్స్‌లో రాణిస్తున్న చిన్నారులు
- రాష్ట్రస్థాయిలో పతకాల కైవసం
- ఆత్మరక్షణ విద్యలో ఉచిత శిక్షణ
- బ్లాక్ బెల్టు సాధించిన 50 మంది

సత్యవేడుకు చెందిన విద్యార్థులు కరాటేలో రాణిస్తున్నారు. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైన ఎంఏ భాస్కర్ తనకు తెలిసిన మార్షల్ ఆర్ట్స్‌లో మండల కేంద్రంలోని చిన్నారులకు ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని పలువురు ఆయన వద్ద కరాటేలో శిక్షణ పొందారు. ఇలా ఆయన వద్ద శిక్షణ పొందిన 50 మందికి పైగా కరాటేలో బ్లాక్ బెల్టు సాధించారు. -సత్యవేడు


కరాటే శిక్షణలో పొందుతున్న విద్యార్థులు

మార్షల్ ఆర్ట్స్‌ను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైన ఎంఏ భాస్కర్ మార్షల్ ఆర్ట్స్‌లో చిన్నారులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. అంతే కాకుండా పలు పాఠశాలల్లో విద్యార్థులకు కరాటే నేర్పుతున్నారు. ప్రస్తుతం అతని శిక్షణలో 50 మందికి పైగా కరాటేలో బ్లాక్ బెల్టు పొందిన క్రీడాకారులు ఉన్నారు.


సత్యవేడు బాలుర ఉన్నత పాఠశాలలో కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థులు

దాతల కోసం నిరీక్షణ

వృత్తిరీత్యా పార్ట్‌టైం ఉపాధ్యాయుడైన భాస్కర్ ఉచితంగా పిల్లలకు శిక్షణ ఇస్తున్నాడు. టోర్నమెంట్లకు శిక్షణ పొందిన విద్యార్థులను దేశ, విదేశాలకు తీసుకువెళ్లాలంటే ప్రయాణ ఖర్చుల కోసం ఇబ్బంది పడాల్సి వస్తోంది. దాతలు ముందుకు వస్తే తన శిష్యులను నేషనల్, ఇంటర్ నేషనల్ పోటీలకు తీసుకెళ్లాలని నిరీక్షిస్తున్నాడు. ఇండియన్ కౌన్సిల్ ఫర్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ అండ్ గవర్నమెంట్ ఆఫ్ కర్ణాటక ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ కరాటే గేమ్స్ 2023 పోటీల్లో సత్యవేడు చెందిన ముగ్గురు విద్యార్థులు పాల్గొని, బంగారు, సిల్వర్, బ్రాంజ్ పతకాలు సాధించారు. ఆ విద్యార్థుల మనోభావాలు ..

పసిడి పతకమే లక్ష్యం



మాది సత్యవేడు. మా నాన్న కిరణ్ కుమార్ ఆటోడ్రైవర్. అమ్మ భువనేశ్వరి గృహిణి. నేను ఐదో తరగతి నుంచి కరాటే మాస్టార్ భాస్కర్ వద్ద కరాటే నేర్చుకుంటున్నా. అంతర్జాతీయ స్థాయి లో బంగారు పతకం సాధించాలన్నది నా కోరిక. కర్ణాటక రాష్ట్రంలో 2023లో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీలో పాల్గొని బంగారు పతకం సాధించాను. ప్రభుత్వ ఉద్యోగం చేసి అమ్మనాన్నాను కాపాడుతా.

-రంజిత్ కుమార్ సత్యవేడు

క్రీడా కోటాలో ఉద్యోగం సాధిస్తా



క్రీడల్లో రాణించి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా పెట్టుకొన్నా. అందుకే ఇంటర్ చదువుతూ ఆర్మీ, నేవీలో ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నా. నాన్న ఎస్. మురళి, అమ్మ ప్రమీల కూలీపని చేసి, నన్ను చదివిస్తున్నారు. అమ్మనాన్న ప్రోత్సాహం మరువలేనిది. కర్ణాటకలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించాను.

-దితేష్‌కుమార్, సత్యవేడు

కరాటేతో గుర్తింపు తెచ్చుకుంటా



మాది సత్యవేడు. నేను మా అత్త వాళ్ల ఇంట్లో ఉంటున్నాను. స్థానిక బాబు జూనియర్ కళాశాలలో చదువుతున్నాను. మా కరాటే మాస్టార్ జూడోలో శిక్షణ ఇచ్చారు. తొలుత జిల్లాస్థాయి పోటీలో బంగారు పతకం సాధించాను. కర్ణాటకలో జరిగిన కరాటే పోటీలో బ్రాంజ్ పతకం కైవసం చేసుకున్నాను. రోజు మాస్టార్ వద్ద శిక్షణ పొందుతున్నాను. జాతీయస్థాయిలో బంగారు పతకం సాధించి, కరాటేతో గుర్తింపు తెచ్చుకోవడమే నా లక్ష్యం.

-జీ.ధనుష్, సత్యవేడు

10 లక్షల మందికి శిక్షణే నా ఆశయం



నేను కుంగ్‌ఫూ, బాక్సింగ్, కిక్ బాక్సింగ్, పెన్ కాక్ సిలాట్, కరాటే విద్యలు నేర్చుకున్నాను. కోయంబత్తూరు, మచిలీపట్నం, ఈస్టు గోదావరి, మదురైలో నేషనల్ టోర్నమెంట్‌లో బంగారు పతకాలు సొంతం చేసుకున్నాను. నాకు వచ్చిన విద్య.. మార్షల్ ఆర్ట్స్(కరాటే)ను ప్రస్తుతం పాఠశాలల్లో చదువుతున్న చిన్నారులకు ఉచితంగా నేర్పుతున్నాను. రాష్ట్రస్థాయిలో 10 లక్షల మందిని మార్షల్ ఆర్ట్స్‌లో ప్రావీణ్యులను చేయాలన్నది నా ఆశయం.

-ఎంఏ భాస్కర్, మార్షల్ ఆర్ట్స్ శిక్షకుడు

క్లుప్తంగా

బాధ్యతగా మొక్కల సంరక్షణ


మొక్క నాటుతున్న టీచర్లు, విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ: పర్యావరణ హితం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలను సంరక్షించాలని కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్ర ధానోపాధ్యాయుడు రూపేష్‌కుమార్ తెలిపా రు. శనివారం పాఠశాల ఆవరణలో శిక్షా సప్తా హ్‌లో భాగంగా నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో ఎకో క్లబ్ దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటి కాపాడుకోవాల్సిన అవసరముందన్నారు. దీంతో వాతావరణ సమతుల్యతను సాధించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఎకో క్లబ్ కన్వీనర్ లక్ష్మయ్య పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ


విద్యాసామగ్రి అందిస్తున్న ఎంఈఓ రవి

సత్యవేడు: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బిలీవ్ ఎఫెక్ట్ సర్వీస్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎంఈఓ రవి విద్యాసామగ్రిని శనివారం పంపిణీ చేశారు. మొత్తం 50 మంది పిల్లలకు నోట్సులు, పెన్నులు, పెన్సిళ్లు, వాటర్ బాటిల్స్, జామెంట్రీ బాక్సులు, రబ్బర్లు, స్కేళ్లు అందించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు, ట్రస్టు నిర్వాహకులు శరవణన్, సెక్రటరీ రాజా, ప్రధానోపాధ్యాయు లు రోహిణి, కృష్ణవేణి, కార్తీక్ పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపుల పరిశీలన


ఆధార్ నమోదును పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గ్రామ సచివాలయాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ క్యాంపులను ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు పరిశీలించారు. శనివారం ఈ మేరకు బీఎన్ కండ్రిగ సచివాలయంలో ఆధార్ నమోదును తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లల ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేట్, చిరునామా, సెల్‌ఫోన్ నంబర్ల మార్పులు చేర్పులు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా పార్కింగ్


వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ

నాగలాపురం: పిచ్చాటూరు మండలం రామగిరిలోని సుబ్రమణ్య స్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఎరిగేషన్ గ్రౌండ్‌లో వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 28, 29, 30 తేదీల్లో భరణి, కృత్తిక, రోహిణి ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో భారీగా భక్తులు తరలివచ్చే అవకాశముందన్నారు. అందువల్ల ఈ మైదానంలో పార్కింగ్ సౌకర్యం కల్పించామన్నారు. ఈ మూడురోజులపాటు ఎరిగేషన్ గ్రౌండ్‌లో క్రికెట్ ఆడవద్దని స్థానిక యువతకు సూచించారు.

ముక్కంటి సేవలో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే


ధ్వజస్తంభం వద్ద ఎమ్మెల్యే శ్రీనివాసరావు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని శనివారం తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయాధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించారు. తరువాత స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా పర్యావరణ దినోత్సవం

చంద్రగిరి: స్థానిక ఆర్‌ఎఫ్ రోడ్డులోని బ్లూమింగ్ బడ్స్ పాఠశాలలో శనివారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. భావి తరాలకు కాలుష్య రహిత ప్రకృతిని అందించేందుకు బాలబాలికలకు అవగాహన, స్ఫూర్తి కలిగించాలని ఉద్దేశంతో నర్సరీ నుంచి యుకేజీ విద్యార్థులకు గ్రీన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలు అందరూ పచ్చని దుస్తులతో వచ్చి పచ్చని చెట్ల వల్ల కలిగే లాభాలను, ప్రయోజనాలను ఆటపాటల రూపంలో వివరించారు. విద్యార్థులందరూ పర్యావరణ పరిరక్షణపై చిత్రలేఖనం ద్వారా వారి భావాలను వ్యక్తపరిచారు. అనంతరం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం

శ్రీకాళహస్తి రూరల్: శ్రీకాళహస్తి పైప్ లిమిటెడ్ పరిశ్రమలో ప్రమాదంలో మృతి చెందిన సంఘటనపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సంఘటన స్థలాన్ని పరిశీలించామని ఆర్డీఓ రవిశంకర్ రెడ్డి తెలిపారు. అలాగే మృతుడి కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడామన్నారు. శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రి వద్ద ఆర్డీఓ మీడియాతో మాట్లాడుతూ సంఘటన జరిగిన వెంటనే జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు సంఘటన స్థలానికి చేరుకున్నామన్నారు. పరిశ్రమ నుంచి మృతుడి కుటుంబానికి రావాల్సిన నష్టపరిహారంపై పరిశ్రమ అధికారులతో చర్చించి, అతడి కుటుంబానికి న్యాయం చేస్తామని తెలిపారు.


మీడియాతో మాట్లాడుతున్న ఆర్డీఓ రవిశంకర్ రెడ్డి

ప్రభుత్వం నుంచి కూడా ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థుల్లో భక్తిభావన పెంపొందించాలి

శ్రీకాళహస్తి: విద్యార్థుల్లో భక్తిభావన పెంపొందించాలని హిందూ ధర్మప్రచార పరిషత్ సభ్యులు పోతుల రాజ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ఓ స్కూల్‌లో శనివారం విద్యార్థులతో హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో 108 సార్లు వెంకటేశ్వర స్వామి వారి శతనామావళి రాయించారు. ఇందులో సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం వాటిని స్వామివారి చిత్రపటం వద్ద ఉంచి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ కంటి ఆస్పత్రి డైరెక్టర్ సుజాతాదేవి, యోగా గురువు కృష్ణకుమార్ స్వామి, పీవీఆర్ గ్రూప్


వేంకటేశ్వర శతనామావళి రాస్తున్న విద్యార్థులు

డైరెక్టర్ పరమేశ్వర్‌రావు పవార్, ప్రధానోపాధ్యాయురాలు విశాల తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

ఏర్పేడు: మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని డీఈఓ శేఖర్ అన్నారు. శనివారం శిక్షా సప్తాహ్ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా మండలంలోని పల్లం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి డీఈఓ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షా సప్తాహ్ వారోత్సవాలు ఈ నెల 22 నుంచి 29వ తేదీ వరకు జరుగుతాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలన్నారు. అడవులను పరిరక్షించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులతో బోధన జరుగుతుందన్నారు. నూతన విద్యావిధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఆనంద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పల్లం స్కూలులో మొక్క నాటుతున్న డీఈఓ శేఖర్

ఆడికృత్తిక ఏర్పాట్ల పరిశీలన

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన కుమారస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం ఈఓ ఎస్‌వీఎస్‌ఎన్ మూర్తి, పోలీసులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ సామాన్య భక్తులు సర్వదర్శనం కల్పించేలా క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే వీఐపీలకు కూడా ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేశామన్నారు. ఇక నారదపుష్కరణిలో తలనీలాలు సమర్పించే భక్తులకు స్నానఘట్టాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


నారద పుష్కరణిలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఈఓ

అర్ధరాత్రి అగ్నిప్రమాదం

తిరుపతి - కరకంబాడి రోడ్డులోని ఓ ఫర్నిచర్ గోదాములో శనివారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. తులసి ఎంటర్ ప్రైజెస్ ఫర్నిచర్ గోదాములో అర్ధరాత్రి జరిగిన ఈ అగ్నిప్రమాదంలో దాదాపు రూ.రెండు కోట్ల విలువైన సామగ్రి అగ్నికి ఆహుతైపోయినట్లు తెలిసింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం సంభవించినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

-రేణిగుంట



పౌష్టికాహారంపై అవగాహన


భోజనం తింటున్న విద్యార్థులు

సత్యవేడు: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పౌష్టికాహారం, పర్యావరణంపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు పాండురంగయ్య మాట్లాడుతూ ఆహారంలో డ్రైఫ్రూట్స్ తీసుకోవాలన్నారు. ముఖ్యంగా వాల్‌నట్స్, బాదం, జీడిపప్పు, గుమ్మడి విత్తనాలు, సన్‌ఫ్లవర్ సీడ్స్ తినాలని కోరారు. అలాగే బార్లీ, బ్రౌన్‌రైస్, మిల్లెట్, ఓట్‌మిల్ వంటి చిరుధాన్యలను భుజించాలని సూచించారు. అనంతరం శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పోషకాహార భోజనం వడ్డించారు. ఇందుకు దాతలు లక్ష్మీనాథబాబు, గంగాధరం ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పి.వెంకటేశ్వర్లు, వైవీఎల్ కుమార్, కృష్ణయ్య, అన్వర్, బాలాజీ, రఫీ, శ్రీదేవి, పుష్ప, పీడీ మురళి, భాస్కర్ పాల్గొన్నారు.

ఘనంగా కావడి మహోత్సవం


కావళ్లతో వెళుతున్న భక్తులు

ఏర్పేడు: మండలంలోని బాలకృష్ణాపురంలో శనివారం ఆడికృత్తిక సందర్భంగా కావడి మహోత్సవం ఘనంగా జరిగింది. గ్రామస్తులు మేళతాళాలతో కావడిలు ధరించి ఊరేగింపుగా గ్రామదేవతల ఆలయాల్లో పూజలు చేసి, మూకుమ్మడిగా తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయానికి వెళ్లారు. ప్రతి ఏడాది ఆడికృత్తికకు గ్రామస్తులందరూ కలిసి తిరుత్తణికి కావడితో వెళ్లి తలనీలాలు సమర్పించి, మొక్కులు తీర్చుకునేది ఆనవాయితీగా వస్తోంది.

కుష్టువ్యాధి నివారణపై అవగాహన

రామచంద్రాపురం: మండలంలోని అనుప్పల్లెలో కుష్టు, క్షయ నివారణ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనివారం కుష్టువ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కుప్పంబాదూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి తేజస్విని తమ సిబ్బందితో కలసి ఇంటింటికీ వెళ్లి లెప్రసీ డిటెన్షన్ సర్వే నిర్వహించారు. అనంతరం శ్రీనివాసులు మాట్లాడుతూ శరీరంపై స్పర్శ లేని మచ్చలు, బుడిపెలు, నొప్పిలేని పుండ్లు, చెవి తమ్మెలు మందంగా మారి ముఖంపై నూనె రాసినట్లు జిడ్డుగా నిగనిగలాడే చర్మం ఉండడం వంటి లక్షణాలు ఉంటే కుష్టు వ్యాధి సోకినట్లుగా అనుమానించి సమీపంలోని పీహెచ్‌సీకి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయితే శస్త్ర చికిత్స, మందులు ఉచితంగా అందించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైద్యులు రాజా, రమణ, కిరణ్‌కుమార్, ప్రసాద్ రావు పాల్గొన్నారు.

సాఫ్ట్ స్కిల్స్‌తో బంగారు భవిత

తిరుపతి సిటీ: విద్యార్థినుల బంగారు భవితకు అకడమిక్ విద్యతో పాటు సాఫ్ట్ స్కిల్స్ ముఖ్యమని డీన్ ప్రొఫెసర్ సి.వాణి తెలిపారు. శ్రీపద్మావతీ మహిళా వర్సిటీ కెరీర్ కౌన్సిల్ సెల్, ఏపీ ఐటీ అకాడమీ తరపున నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆరురోజులుగా నిర్వహిస్తున్న సాఫ్ట్ స్కిల్స్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ శనివారంతో ముగిసింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వాణి మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో నిలబడాలంటే విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ అవసరమని వెల్లడించారు. శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ప్రొఫెసర్ కిషోరి, లక్ష్మీప్రసాద్, భూపతి రాజు, ప్రియ, వజీహాభాను, రజని, రాజ్యలక్ష్మి, సౌమ్య పాల్గొన్నారు.

మహిళపై కేసు నమోదు

ఏర్పేడు: మండలంలోని పంగూరు ఎస్సీ కాలనీలో జరిగిన దాడి ఘటనకు సంబంధించి ఓ మహిళపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు శనివారం తెలిపారు. సీఐ కథనం మేరకు.. పంగూరు ఎస్సీ కాలనీకి చెందిన తులసమ్మపై అదే కాలనీకి చెందిన రాధ, కుటుంబ సభ్యులు కత్తితో దాడి చేశారు. ఈ దాడిలో తులసమ్మకు గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు రాధపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

పరిసరాల శుభ్రత తప్పనిసరి


మురుగునీటి నిల్వను తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని చిన్నయగుంట గ్రామ కార్యదర్శి శివకుమార్ తెలిపారు. శనివారం ఈ మేరకు గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకును శుభ్రం చేసి, క్లోరినేషన్ చేశారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో దోమలు వ్యాప్తి చెందకుండా చూసుకోవాలని, నీటిని కాచి చల్లార్చి వడపోసి తాగాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రకాష్ నాయుడు పాల్గొన్నారు.

రావణబ్రహ్మపై కుమారస్వామి

శ్రీకాళహస్తి: విజ్ఞానగిరిపై ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత కుమారస్వామి ఆలయంలో జరుగుతున్న ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామిఅమ్మవార్లు రావణబ్రహ్మవాహనంపై పురవీధుల్లో ఊరేగారు. ఆలయంలోని అలంకార మండపంలో స్వామిఅమ్మవార్లకు పలు అభిషేకాలు చేశారు. అనంతరం విశేషాలంకరణ చేసి, పూజలు నిర్వహించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామిఅమ్మవార్లు రావణబ్రహ్మ వాహనంపై పురవీధుల్లో ఊరేగారు. భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎస్‌వీఎస్‌ఎన్ మూర్తి, ఆలయఅధికారులు తదితరులు పాల్గొన్నారు.

హంసవాహనంపై కుమారస్వామి చిద్విలాసం

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై ఉన్న కుమారస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారు హంస వాహనంపై ఊరేగారు. ముందుగా ఆలయ అలంకార మండపంలో శ్రీవల్లి, దేవసేన సమేత కుమారస్వామికి వివిధ రకాల అభిషేకాలు చేశారు. విశేషాలంకరణ చేసి, ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి అమ్మవార్లను హంసవాహనంపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని, మొక్కులు తీర్చుకున్నారు.


పురవీధుల్లో ఊరేగుతున్న కుమారస్వామి

అధ్వాన 'వసతి'పై ఆవేదన

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడులో ఉన్న ఏకలవ్య మోడ్రన్ గురుకుల పాఠశాలలో వసతులు లేవని, సక్రమంగా ఆహారం సైతం వడ్డించడం లేదని, ఉపాధ్యాయులు బోధన అర్థం కావడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం పాఠశాల పరిశీలనకు వచ్చిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలానికి తమ సమస్యలను ఏకరవు పెట్టారు. మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని, స్నాక్స్ ఇవ్వడం లేదని, కోడిగుడ్లు సక్రమంగా అందించడం లేదని, చికెన్ రెండు ముక్కలను విదిలిస్తున్నారని, నీళ్ల పాలు, ఉడికీ ఉడకని అన్నంతోపాటు రోజూ పప్పు మాత్రమే పెడుతున్నారని వెల్లడించారు. గదికి పది మంది చొప్పున ఉంటున్నామని, స్నానానికి నీళ్లు కూడా రావని, బాత్ రూమ్‌లలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలు అర్థం కావడం లేదని వాపోయారు. ఈ మేరకు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పీఓ పరిమళ, డీటీడబ్ల్యూఓ సూర్యనారాయణ, ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, ఎంఈఓ రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు సమస్యలు విన్నవిస్తున్న విద్యార్థులు

13,14 తేదీల్లో రేణిగుంట గంగమ్మ జాతర


ఆలయంలో సమావేశమైన గంగమ్మ గుడి చైర్మన్ సోలా మల్లికార్జునరెడ్డి, సభ్యులు

రేణిగుంట: గంగమ్మతల్లి జాతర వచ్చే నెల 13, 14వ తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ సోలా మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులతో ఆయన ఆలయ ఆవరణలో శనివారం సమావేశమయ్యారు. తొలుత అమ్మవారిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఏటా ఎంతో వైభవంగా నిర్వహించే రేణిగుంట గంగజాతర ఈ సారి కూడా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆగస్టు 6 తేదీన జాతర చాటింపు, 12వ తేదీన రాత్రి గరిగె ఊరేగింపు, 13వ తేదీన గంగమ్మ ఆలయంలో పొంగళ్లు, అమ్మవారి దర్శనం, నడివీధి గంగమ్మ శూలం వద్ద అంబళ్లు, 14వ తేదీన నడివీధి గంగమ్మ వద్ద అమ్మవారి ప్రతిష్ఠ, సాయంత్రం నైవేద్యం సమర్పణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు మాజీ సర్పంచ్ జ్యోతినారాయణ, సదాశివరెడ్డి, వీఆర్ రావణన్, లక్ష్మీరెడ్డి, భాస్కర్, సూరి, చినబాబు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుకు మోక్షం

రేణిగుంట: స్థానిక తహసీల్దార్ కార్యాలయం, బీసీ హాస్టల్‌కు వెళ్లే మార్గం గుంతలమయం కావడంతో ప్రజాసంఘాల వినతులతో ఏపీఐఐసీ అధికారులు రహదారి మరమ్మతుకు సంసిద్ధత చూపారు. ఈ రోడ్డు ఏపీఐఐసీ రేణిగుంట ఇండస్ట్రియల్ ఎస్టేట్ పరిధిలోకి రావడంతో రోడ్డును బాగు చేయించాలని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ చంద్రశేఖర్‌కు ఇటీవల సీఐటీయూ, జనవిజ్ఞాన వేదిక నాయకులు వెంకటరమణ వినతిపత్రం అందజేశారు. స్పందించిన డీఈ రాంబాబు శనివారం ఆ మార్గంలో సర్వే చేసి, రోడ్డు మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దీంతో వారికి ప్రజాసంఘాలు ధన్యవాదాలు తెలిపారు.


రోడ్డును పరిశీలిస్తున్న ఏపీఐఐసీ డీఈ రాంబాబు, ప్రజాసంఘాల ప్రతినిధులు

వీల్‌చైర్ అందజేత

ఏర్పేడు: మండలంలోని మునగలపాళెం గ్రామానికి చెందిన దివ్యాంగుడు దామోదరానికి శనివారం లక్ష్మీనరసింహ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వీల్‌చైర్ అందజేత జరిగింది. ఏర్పేడు పోలీస్‌స్టేషన్ వద్ద జరిగిన లారీ ప్రమాదంలో గాయపడిన దామోదరం ఎడమకాలు తీసివేయడంతో దివ్యాంగుడిగా మారాడు. ఈ క్రమంలో నడవలేని పరిస్థితిలో ఉన్న దామోదరం విన్నపం మేరకు లక్ష్మీనరసింహ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకురాలు సాయిదమ్మ ఉచితంగా వీల్ చైర్‌ను అందించి, మానవత్వాన్ని చాటుకున్నారు.


వీల్‌చైర్ పొందిన దామోదరంతో సాయిదమ్మ